

# మాయమైన మలుపు

—రాణి శివశంకర్

జాన్ పరిచయమై రెండు సంవత్సరాలైనా నిజంగా పరిచయమైంది మొన్న జనవరి 28న. జారవేసిన తలుపులు తెరిచి లోపలికి అడుగుపెట్టాను. లోపలి వాతావరణం చాలా గంభీరంగా వుంది. నా రాకని ఎవరూ గుర్తించినట్లే లేదు.

—"ఎంత కాలం వాయిదా వేస్తావ్"

"నా కిష్టం లేదు"

"ఆ అమ్మాయి యిష్టం లేకపోతే మరో అమ్మాయిని"

"నేను ఒక నిర్ణయానికి రాలేదు. నన్ను ప్రశాంతంగా విడిచిపెట్టండి"

వెళ్లిపోదామనుకుంటుండగా జాన్ నన్ను గుర్తించాడు. 'ఏదో సీరియస్‌గా మాట్లాడుతున్నారనుకుంటా. మళ్ళీ కలుస్తా' అన్నాను.

"పర్వాలేదు .వచ్చి కూర్చో" అని కుర్చీ చూపించాడు.

"నువ్వైనా చెప్పు. ఇంతకాలం ఉద్యోగం లేదని పెళ్లి వాయిదా వేశాడు, ఇప్పుడేం తెగులు" అన్నాడు జాన్ తండ్రి నాతో.

"నేను పెళ్లి చేసుకోను"

"ఎందుకని?"

"అది చెప్పలేను. ఇష్టం లేదంతే"

"నీ యిష్టాయిష్టాలతో సంబంధం లేదు. రోగాలూ ముసలితనం అన్నీ తరుముకొస్తాయి. అప్పుడు చూసే వాళ్లెవరుంటారు! తోడు లేకుండా బతకడం కష్టం!"

జాన్ బయటికి వచ్చాక నాతో అన్నాడు.

"వాళ్లు భయంతో పెళ్లి చేసుకున్నారు. భయంతోనే పిల్లల్ని కన్నారు. భయం తప్ప మరేమీ లేదు వాళ్లలో. ఆ క్షుద్ర జీవులు మన జీవితాల్ని శాసించాలనుకుంటారు. అర్థం వుందా! వాళ్లేం చెప్పినా చెయ్యను. పొరపాటున కూడా వాళ్ళ సలహాలు మంచివయ్యే వీల్లేదు"!

అలా పరిచయమయ్యాడు జాన్. వాడికీ నాకూ ఒకే వూర్లో ఉద్యోగం. ఒకే గదిలో బస. నన్నూ పెళ్ళి చేసుకోమని మా యింట్లో వాళ్ళు ఒకటే నస. నాలుగైదు సంవత్సరాల క్రితమైతే బెంచీ చివర్నున్న ఊర్వశిని తప్ప మరొకర్ని వరించనని తెగేసి చెప్పేవాణ్ణి. ఇప్పుడెవర్ని చేసుకోవాలి? ఎందుకు చేసుకోవాలి? అన్నీ ప్రశ్నలే.

జాన్ బూట్ల టకటకలకి ఆలోచనల్లోంచి బయటికి వచ్చాను, రోజు లాగే డాబా మీదికి చేరాం. కనుచూపుమేర వరకు పరుచుకున్న రోడ్డు నిర్మానుష్యం. ఒక అపరిచితుడు ఒంటరిగా మలుపుతిరిగాడు. ఒక కుక్క ఏం చేయాలో తోచనట్టు భౌమని, చెవులు విదిలించి మౌనం వహించింది. మసక వెన్నెల. జాన్ మెటికలు విరుస్తున్నాడు. కుర్చీలో నడుం వెనక్కి వాల్చి ఆకాశంలోకి చూస్తూ "ప్రేమ అనేది వొకటి వుంటే ఎంత బాగుండును" అని మూలిగాను.

"అంటే" వెంటనే జాన్ ప్రశ్న.

"అదే ప్రేమ..."

"ఏదైనా మాట్లాడే ముందు ఒకసారి ఆలోచించడం మంచిది" ఈసారి వాడి గొంతు బిగ్గరగా ధ్వనించింది. ఆ మాటలకి నా మనస్సెక్కడికెక్కడికో పోయింది. ప్రేమ కోసం ఊరూ వాడా, ఇల్లూ బజార్లూ గాలించింది. రైలు పట్టాల పక్క తెగిపడిన తల, స్టౌ ప్రమాదం, అర్థరాత్రి బేరాలు, పొగ ముసుగులో అమ్మ, పెళ్ళిళ్ళు బలాత్కారాలు, బలవంతపు గర్భస్రావాలూ కులాలూ మతాలూ వేల వేల సుడిగుండాల నది! ఇంతకీ ఏదీ ప్రేమ, ఎక్కడ?

కొన్ని రోజుల క్రితం కిటికీలో పిచ్చుకలా జ్ఞాపకం వచ్చి వాలింది. చిరునవ్వే జ్ఞాపకం. "ఎందుకో మరీ అంత హుషారు" అని జాన్ అడిగాడు కూడ. గదిలో కూర్చుంటానా, ఆకాశంలో తేలిపోతున్నట్లు వుంటుంది. కానీ జాన్ బూట్ల టకటకలకి నక్షత్రాలే చెదిరిపోతాయి.

ఎందుకో నా ప్రయాణ రహస్యాన్ని వాడికి చెప్పదలుచుకోలేదు. ఎందుకు చెప్పలేదో కారణం వెతకడానికి కూడా సాహసించలేదు. కానీ రాత్రి బ్యాగ్ సర్దుతుండగా వచ్చి 'ఎక్కడికి పోతున్నావ్‌?' అని అడగడంతో ఫలానా వూరని చెప్పేశాను. "ఎందుకు, ఎవరికోసం" అని అడగాలని ఆశించాను. కాని వాడు మౌనంగా వుండిపోయాడు. చాలాసార్లు జాన్ మౌనం ఆందోళన కలిగిస్తుంది.

రోజూ లాగే డాబా మీదికి చేరాం. వాడి నుంచి నన్ను దాచుకోవడం కష్టంగా వుంది. నిజానికి వాడిలో ఏదో భయంకరమైన ఆకర్షణ వుంది.

'స్నేహితురాలిని కలవడం కోసం వెళ్తున్నా'నని చెప్పాను.

'స్నేహితురాలు అంటే?' జాన్ ప్రశ్నకు నాకు చిర్రెత్తుకొచ్చింది.

"చచ్చు ప్రశ్నలొద్దు. పక్కవాణ్ణి అర్థం చేసుకోవడం నేర్చుకో"

"నిజానికి నేనెవర్నీ ఇబ్బంది పెట్టడానికి ప్రశ్న అడగను. నా బుర్ర నిండా ప్రశ్నలే. నేనేం చెయ్యను? ఐనా కంట్రోల్ చేసుకుంటా చెప్పు" అన్నాడు జాన్.

"రెండు సంవత్సరాల క్రితం ఒక మిత్రుడి యింటికి వెళ్ళినప్పుడు వాడు నాకు తన చెల్లెల్ని పరిచయం చేశాడు. ఆ యింట్లో వున్న ఒక్క రోజులోనే ఆమె నాకు ఆత్మీయురాలైంది. నిజానికి ఆమె ఎక్కువగా మాట్లాడేదీ కాదు. కానీ నిర్మలమైన ఆమె చిరునవ్వు యీనాటికీ నాలో మినుకుమినుకుమంటూనే వుంది. నేను తిరిగివస్తూ వెనక్కి తిరిగిచూశా, ఆమె గుమ్మంలో చిరునవ్వుతూ నిలబడి వుంది. వెన్నెల్లో ఆమె చిరునవ్వు ఊరంతా పరుచుకుంది. ఆ ఒక్క క్షణం నన్నీనాటికీ బతికిస్తోంది. మళ్లీ ఆ క్షణం కోసం..."

జాన్ ముఖం మరింత గంభీరంగా తయారైంది. నిమిషం మౌనం తరువాత అన్నాడు "నా అనుభవం ఒకటి గుర్తొస్తోంది- మా కుటుంబం ఆ రోజుల్లో ఒక పల్లెటూర్లో వుండేది. నేనింకా బడిలో చదూతున్నా. అప్పుడు అరుణా నేనూ ఒక జట్టు. మామిడికాయలు రాళ్ళతో కొట్టి మూట కట్టుకుని ఒకటే పరుగు. పంటకాలువల్లో కాళ్ళుంచి కబుర్లు, బడికి పంగనామాలు, కాలువలో కేరింతలు, పరుగులు, ఆటలు, దాగుడుమూతలు, ఉవ్వెత్తున ఎగిసే బాల్యం అది. అరుణ ఒక సెలయేరు. మేం ఆ వూరు విడిచి ఎప్పుడో వచ్చేశాం. కానీ అరుణ స్మృతి చెరిగిపోలేదు. పంట కాలువని గెంతుతున్న అరుణ, ఉత్సాహంతో ఉరక లేసే అరుణ, ఒక స్మృతిగా మిగిలిపోయింది.

జీవితం చాచికొట్టిన దెబ్బలకి ఆ చిరునవ్వుల సీతాకోకచిలుకలు ఎగిరిపోయాయి. కాంపిటీషన్ సక్సెస్, జి.కె. పుస్తకాలూ, అప్లికేషన్లూ ఊరికే ఉరకలూ, పరుగులూ.

ఎన్నో సంవత్సరాల తరువాత ఆ జ్ఞాపకం కోసం రెక్కలు కట్టుకుని వెళ్లా. ఆ వూరే మారిపోయింది. దారి పొడవునా పరుచుకున్న చల్లని నీడలు లేవు. ఆహుతై మొండి గోడలుగా మిగిలిన పూరిళ్ళు. వాటిలో సగం ధ్వంసమైన యిల్లు. అదే అరుణ యిల్లుట. అప్పటి అరుణకీ, ఇప్పటి అరుణకీ పేరులో తప్ప పోలికే లేదు. కళ్ళలో ఆ చలాకీతనం లేదు. చిరునవ్వులో ఆ జీవం లేదు. ఎలా సంభాషణ ప్రారంభించాలో తెలియడం లేదు.

"ఎలా వున్నావు?"

"ఇలాగే"

"అగ్నిప్రమాదమా?"

"కాదు. ఎన్నికల ప్రమాదం"

పిల్లవాడికి కొంగుచాటున పాలిస్తూ 'పెళ్ళైందా' అని అడిగింది. లేదన్నాను.

'మరి ఇంకెప్పుడు చేసుకుంటావు?'

'మీరందరూ చేసుకుని ఏం బాగుపడ్డారు?'

'ఐనా పెళ్ళీ, చావూ తప్పవుకదా?' అంది విషాదంగా నవ్వుతూ.

ఆ చెదిరిన కల కెదురుగా ఎక్కువసేపు నిలవలేక వచ్చేస్తుండగా బియ్యం కోసం డబ్బు అడిగింది, బలహీనమైన కంఠస్వరంతో

జాన్ ఏడుస్తున్నాడు. జాన్‌కీ కన్నీళ్ళు! బూట్ల చప్పుడుతోనే అన్నిటినీ చెదరగొట్టే జాన్‌కి!

జాన్ స్మృతులు నన్నీ నాటికీ ఆ వూరు వెళ్లనీలేదు.

## ఉగాది రాగము

ఆటుపోటు నొందిన
　　నవాంగణముల్ కమనీయ పల్లవ
శ్రీకమ్ములై మరందరస శీకర
　　సేక మమ్ప్రకాశికా
వేశ లతాళులై పరల
　　నెయ్యము తియ్యపు నూత్నవత్సరా
లోకములోన మా తెలుగు
　　లోకములున్ పులకించి పోవలెన్

తీయని చేదు సా నకపు
　　తీరు, వికీర్ణ కవోష్ణశీతల
చ్ఛాయల సౌరు, కోమల
　　రసాలకిసాలయ నింబపల్లవ
శ్రీయుత తోరణమ్ములును
　　చిత్తము హత్తనిదేమి చిత్తరం
బోయనిపించుగా తెలుగు
　　ముంగిళులందు ఉగాది వేడుకల్

యువత డెందమునకు ఉత్తేజమలరించు
నెచ్చదనముతోడ ముచ్చటించి
నవత కాప్పదమ్ము నేవు నచ్చదనముతో
బాంధవమ్ము నెరపు పండుగ యిది

మ్రోయగా వలయును కోయిల గొంతుక
　　మహిత జాతీయ సమైక్య గీతి
వాసించవలె మల్లికా సుమకుంజము
　　సౌజన్య సౌహార్ద సౌరభమ్ము
తులకించవలె మందమలయానిలమ్మునా
　　శాంతి ప్రసన్న చల్లదనము
తనరించవలయు మధ్యాహ్న తపమ్మున
　　దేశాభ్యుదయతీక్ష్ణ దివ్యదీక్ష

సూత్రబద్ధమై సాగు ఈ చైత్ర రథము
నవ వికాసోత్త మీవసంత ప్రవృత్తి
శ్రేయమై, ధ్యేయమై యివ్వ ఈ యుగాది
మానవ ప్రబోధ స్ఫూర్తి మలచుగాత!

—వేముగంటి నరసింహాచార్యులు